నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వరంగల్ (తూర్పు) అసంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని మండిబజార్ కిడ్డికూప్ పాఠశాలలో పూర్తిగా మహిళలచే నిర్వహించబడి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సందర్శించి పోలింగ్ కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించి చేపట్టిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలలో వినూత్నంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా మహిళలచే నిర్వహించబడేలా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఉన్న 7అసంబ్లీ సెగ్మెంట్లలోని ప్రతి సెగ్మెంట్‌లో 5 మహిళ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రానికి ఓటర్లకు స్వాగతం పలికేలా ఆహ్వాన బ్యానర్,ఎంట్రన్స్ నుండి గ్రీన్ కార్పెట్ ఏర్పాటుతో పాటు బెలూన్‌లతో అలంక రణ, అన్ని టేబుల్స్‌ను వస్త్రం తో కప్పి ఉంచడం, ఓటు వేయడానికి మాతమూర్తులతో వచ్చే పిల్లలు ఆడుకోవడానికి ఆట బొమ్మల ఏర్పాటు, మహిళా పోలింగ్ సిబ్బందికి ఏక రూప దుస్తులు (డ్రెస్ కోడ్)ధరించి విధులు నిర్వహణ, ప్రత్యేకంగా ఫీడింగ్ రూం ఏర్పాటు, పోలింగ్ కేంద్ర ఆవరణలో రంగవల్లులు, సెల్ఫీ పాయింట్, వాష్ రూం ల ఏర్పాటు, సహాయం అందించడానికి మహిళా సహాయకులు ఏర్పాటు, సూచికలు బాగున్నాయని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రవీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొరాయించిన ఈవీఎంలు

ఎండలో రెండు గంటల పాటు నిరీక్షించిన ఓటర్లు

పోలింగ్ సరళిని పరిశీలించిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత

నవతెలంగాణ-నెక్కొండ

నెక్కొండ మండలంలో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలు చెదురు ముదురు ఘటనల మినహా ప్రశాంతత వాతావరణంలో జరిగాయి. నెక్కొండలోనే మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కవిత సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నెక్కొండలోని బీఆర్ఎస్ నేతలతో కలిసి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. మండలంలోని రెడ్లవాడ ప్రాథమిక పాఠశాలలోని 259 పోలింగ్ కేంద్రంలోని 10 గంటల ప్రాంతంలో ఈవీఎం మురాయించడంతో రెండు గంటలపాటు ఎన్నిక నిలిచిపోయింది. దీనితో వెంటనే సెక్టార్ అధికారులు ఈవీఎంను మార్చే ప్రయత్నం చేయగా ఏర్పాటు చేసిన ఈవీఎం సైతం మొరాయించింది. రెండు ఈవీఎం మొరాయించడంతో మూడో ఈవీఎం ఏర్పాటు చేసి మార్చడంతో టెక్నీషియన్ సహాయంతో ఈవీఎం పనిచేయించారు. ఈవీఎంల మొరాయింపుతో రెండు గంటల పాటు ఓటర్లు ఎండల్లో నిరీక్షించారు. అలాగే మండలంలోని చిన్నకోరుపోలు, చంద్రుగొండ, అలంకానిపేటతోపాటు నెక్కొండ పట్టణంలో స్వల్పంగా పార్టీ నాయకుల తోపులాటలు జరిగాయి. మండలంలోని మడిపల్లి పోలింగ్ కేంద్రంలో ఓ మహిళ ఓటరు తేజవాత్ భిక్కి ఎండ తీవ్రతకు స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే స్పందించిన ఆర్ఎంపీ వైద్యులు బానోతు రవి ప్రథమ చికిత్స చేసి ఇంటికి తరలించారు. నూతనంగా పలువురు యువ ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొని సంతోషం వ్యక్తం చేశారు. నెక్కొండ సిఐ చంద్రమోహన్ పర్యవేక్షణలో ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

శాయంపేట : వరంగల్ పార్లమెంటు పోలింగ్ ప్రక్రియ మండల పరిధిలోని 24గ్రామాలలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో మాక్ పోలింగ్లో వీవీ ప్యాడ్ మొరాయించడంతో మరొకటి మార్చి ప్రక్రియ కొనసాగించారు. ప్రగతి సింగారం గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో సుమారు పది నిమిషాలు పోలింగ్ ప్రక్రియ నిలిచింది. అధికారులు సరిచేసి పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. పోలింగ్ సరళిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సందర్శించి పరిశీలించారు. వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి గోవిందాపూర్, పెద్దకోడపాక గ్రామాలలోని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరకాల ఏసిపి కిషోర్ కుమార్, సిఐ రంజిత్ రావు, ఎస్సై ప్రమోద్ కుమార్ పోలీస్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు.



పంట నష్టపరిహారం చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఖానాపురం

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంతోపాటు, వరి పొలాలలో నేలకూలిన పంట పొలాల రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు సోమవారం మండలంలోని బుధరావుపేట గ్రామంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వరి పంటతో పాటు దెబ్బతిన్న ఇతర పంటలను కూడా సంబంధిత అధికారులతో వెంటనే సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25000 నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కింటాకు రైతులు పండించిన ధాన్యానికి 500 ప్రోత్సాహకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. అనంతరం నష్టపోయిన రైతులను కలిసి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ వేములపల్లి ప్రకాశరావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట రామ నరసయ్య, తాజా మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్, షేక్ మౌలానా, గ్రామ పార్టీ శ్రేణులు, రైతులు ఉన్నారు.



ప్రతాప్ నగర్‌లో స్వల్ప ఉద్రిక్తత

నవతెలంగాణ కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ పరిధిలోని ప్రతాప్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకుడు నల్గొండ రమేష్ ఓటర్లను ప్రభావితం చేస్తున్నాడని బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడికి చేరుకున్న ఫ్లైయింగ్ స్కాడ్, పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను అక్కడి నుండి పంపించేశారు.

కానరాని సౌకర్యాలు

తూర్పు నియోజకవర్గంలోని చాలా పోలింగ్ స్టేషన్ లలో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేక పోయారు. కాశిబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణ అంత బురద మయంగా మారింది. అక్కడ వద్ధులు వికలాంగుల కోసం వీల్ చైర్ ఉన్నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది.

ఉమ్మడి వరంగల్‌లో పోలింగ్ ప్రశాంతం

వరంగల్‌లో 64.08 శాతం

మహబూబాబాద్‌లో 68.6 శాతం

హస్తందే హవా..

వరంగల్‌లో రెండోస్థానానికి బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటాపోటీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో 64.08 శాతం, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో 68.6 శాతం పోలింగ్ నమోదైంది. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్‌లో ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తలేదు. పోలింగ్ సరళిని పరిశీలిస్తే వరంగల్ పార్లమెంటు, మహబూబాబాద్ పార్లమెంటు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు మొగ్గినట్లు కనిపించింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీనిస్తుందని ప్రచారం జరిగినా, పోలింగ్ సరళి ఆయా నియోజకవర్గాల్లో పరిశీలిస్తే పలు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ పార్టీ గట్టి పోటీనివ్వగా మరికొన్ని నియోజకవర్గాల్లో బిజెపి పోటీనిచ్చినట్లు కనిపించింది. దీంతో ఈ నియోజకవర్గంలో రెండోస్థానంలో బిఆర్ఎస్ వుంటుందా ? లేక బిజెపి వుంటుందా ? అన్న చర్చ మొదలైంది. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో రెండోస్థానంలో బిఆర్ఎస్ వుంటుందన్నది స్పష్టంగా కనిపిస్తుంది. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలోని జనగామ నియోజకవర్గంలోని గానుగపహాడ్‌లో పోలీసులు లాఠీఛార్జి చేయడంపై ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు , పోలింగ్ స్టేషన్‌కు రావడంపై బిఆర్ఎస్ ఏజెంట్లు ప్రశ్నించడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది.



ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగిశాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలాంటి సంఘటనలు నమోదు కాలేదు. సాయంత్రం 4.00 గంటలకు ఇక్కడ పోలింగ్ ముగిసింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోను సాయంత్రం 4.00 గంటలకు పోలింగ్ ముగిసింది. దీంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

వరంగల్‌లో రెండోస్థానంపై ఉత్కంఠ..

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో 42 మంది, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిల మధ్యనే వుంది. సోమవారం సాయంత్రానికి పోలింగ్ ముగిశాక పలువురు రాజకీయ పండితుల అంచనాల మేరకు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ తరువాత రెండోస్థానంలో బీఆర్ఎస్ వుంటుందా ? లేక బీజేపీ వుంటుందా ? అన్న చర్చ సర్వత్రా జరుగుతుంది.

డీలా పడ్డ బీజేపీ..

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో తొలుత ప్రచారంలో వేగంగా దూసుకుపోయిన బిజెపి, కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీనిస్తుందని భావించినా, పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఆ పరిస్థితి కనిపించలేదు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు, పలు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ పోటీనివ్వగా, మరికొన్ని నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థి అరూరి రమేష్ పోటీనిచ్చే అవకాశాలున్నాయి. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తే భూపాలపల్లి, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరువాత బిఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరువాత రెండోస్థానంలో బిజెపి నిలిచే అవకాశముందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మొరాయించిన ఈవీఎం

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండ మండలం రెడ్లవాడలోని 259 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మోరాయించడంతో పోలింగ్‌లో తీవ్ర జాప్యం జరిగింది. 186 మంది ఓటర్లు ఓటు వేశాక ఈవీఎం మొరాయించడంతో పోలింగ్‌ను నిలిపివేశారు. దీంతో ఓటర్లు అక్కడే వేచి చూశారు. ఈవీఎం టెక్నీషియన్ ఒకటి తర్వాత ఒకటి మూడు మార్చినా పని చేయలేదు. నాలుగో ఇవిఎం పని చేయడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. శాయంపేట, వెంకటాపూర్, టేకుమట్ల, మలహర్ మండలాలతో పాటు మరికొన్ని మండలాల్లో సైతం ఈవీఎంలు కొదిసేపు మోరాయించాయి. దీంతో మళ్లీ పోలింగ్‌ను ప్రారంభించారు.

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో సాయంత్రం 5.00 గంటల వరకు 64.08 శాతం పోలింగ్ నమోదైంది.

నియోజకవర్గం	ఉదయం 11.00	మధ్యాహ్నం 1.00-300	సాయంత్రం 5.00-6.00	
స్టేషన్‌ఘన్‌పూర్	30.40	47.55	63.51	74.64
పాలకుర్తి	27.20	45.67	60.22	68.41
పరకాల	27.56	46.70	57.48	70.20
వరంగల్ పశ్చిమ	18.24	31.19	38.27	47.00
వరంగల్ తూర్పు	18.50	32.50	47.10	59.43
వర్ధన్నపేట	22.50	41.62	56.40	66.43
భూపాలపల్లి	28.00	45.00	58.00	65.00
మొత్తం పోలింగ్ శాతం	**24.48**	**41.23**	**54.17**	**64.08**

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో 4.00 గంటల వరకే పోలింగ్ ముగియాల్సి వుండగా, 4.00 గంటలలోపు పెద్ద సంఖ్యలో ఓటర్లు తరలిరావడంతో 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 5.00 గంటల వరకు నియోజకవర్గంలో 67.92 శాతం పోలింగ్ నమోదైంది.

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం

నియోజకవర్గం 11.00	ఉదయం 1.00	మధ్యాహ్నం 3.00	సాయంత్రం	5.00
డోర్నకల్	33.33	53.71	64.51	70.86
మహబూబాబాద్	30.95	47.52	58.71	67.19
నర్సంపేట	28.5	43.6	62.3	73.01
ములుగు	29.79	50.66	61.23	67.92
పినపాక	32	49.82	60.68	65.91
ఇల్లందు	30.3	47.58	61.86	69.11
భద్రాచలం	30.1	49.54	60.58	64.72
మొత్తం	**30.66**	**48.81**	**61.58**	**68.6**

రూ. 2లక్షలు ఖర్చు చేసి

ఓటు వేసేందుకు ఫ్లోరిడా నుండి ఇండియాకు..

నవతెలంగాణ గీసుగొండ

మండలంలోని కొమ్మల గ్రామానికి చెందిన వీరాటి విష్ణు వర్ధన్‌రెడ్డి అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. లోక్‌సభ ఎన్నికల దష్ట్యా తన ఓటు హక్కు వినియో గించుకోవడానికి దాదాపు రెండు లక్షలపైగా ఖర్చు వెచ్చించి భారత దేశానికి వచ్చి గ్రామంలోని 175 బూత్‌లో తన ఓటు హక్కును వినియో గించుకుని యువతకు ఆదర్శంగా నిలిచారు. సందర్భంగా విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మన భవిష్యత్తు మన ఓటు హక్కు అని రాబోయే తరాలకు మనం వేసే ఓటు ప్రగతికి సోపానాలుగా మారుతాయని ఆయన అన్నారు.



ఎన్నికల సిబ్బందికి తప్పని తిప్పలు

ఉడకని అన్నం పెట్టారని మనో వేదన - ఆకలికి అలమటించిన సిబ్బంది

నవతెలంగాణ-వరంగల్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మధ్యాహ్నం భోజన ఏర్పాట్లపై అధికారుల నిర్లక్ష్యం వహించారనే చర్చ సాగుతుంది. శనివారం ఎన్నికల విధులు నిర్వహించేందుకు వెళ్లిన సిబ్బందికి రాత్రంతా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో కరెంట్ లేకపోయే సరికి దోమలు కుట్టడంతో ఎన్నికల సిబ్బందికి నిద్ర లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉడుకని అన్నం, నీళ్ల చారు పోసారని సిబ్బంది వాపోయారు. భోజనాన్ని తినలేక ఆకలితో అలమటిస్తున్న విధులు నిర్వహించామని సిబ్బంది గుసగుస లాడుకున్నారు.

డిప్యూటీ మేయర్ భర్త అరెస్టు..!

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో డిప్యూటీ మేయర్ రిజ్వన్ షమీం భర్త మసూద్ ఎన్నికల నియమాలను ఉల్లంఘించి డబ్బులను తమ వద్ద పెట్టుకొని ఓటర్లకు పంపిణీ చేస్తున్నారనే అనుమానంతో మీల్స్ కాలనీ పోలీస్‌లు అరెస్ట్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపర్తి

మనస్థాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే స్థానిక ఎస్ఐ వడ్డె సందీప్ కుమార్ కథనం మేరకు మండలంలోని మోరిపిరాల గ్రామానికి చెందిన కాయితోజు విజయ (43)గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. తమ వ్యవసాయ పొలం వద్ద ఉన్నటువంటి జమాయిల్ చెట్లను విక్రయించి వచ్చిన డబ్బుతో ఆసుపత్రిలో చూపెట్టుకుందాం అనుకుంటే తమ పెద్ద కుమారుడు రణదీర్ అవసర నిమిత్తం వాడుకొని తిరిగి ఇవ్వలేదు. ఆస్పత్రిలో చూపెట్టుకుందామంటే డబ్బులు లేకపోవడంతో మనస్థాపాలకి గురైంది. సోమవారం ఉదయం నిద్ర లేచే సరికి విజయ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో చుట్టు పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరికి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించింది అని వివరించారు. మతురాలి భర్త యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



ఉమ్మడి వరంగల్‌లో ఓటు వేసిన ప్రముఖులు









నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం పలువురు ప్రము ఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదయాన్నే ఓటు హక్కును వినియో గించుకున్నారు. మహబూబాబాద్ నియోజక వర్గంలోని కేసముద్రం మండలం అర్పనపల్లిలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం వంచనగిరిలో ఓటు హక్కును వినియో గించుకున్నారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని ఆంధ్ర బాలిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని హన్మకొండలోని శ్రీనిధి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియో గించుకున్నారు. వరంగల్ పార్లమెంటు నియోజక వర్గ ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ పి. ప్రావీణ్య వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని హంటర్‌రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో ఓటు హక్కును వినియోగించుకున్న హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్. ఎన్పీడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి నక్కల గుట్టలోని ఎస్ఇ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హన్మకొండలోని టీచర్స్‌కాలనీ కమ్యూనిటి హాలులోని పోలింగ్ కేంద్రంలో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి అరూరి రమేష్ హన్మకొండ ఫాతిమానగర్‌లోని బిషప్ బెరెట్టా హై స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. వర్ధన్నపేట నియోజక వర్గం పర్వతగిరిలో 265 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు. హన్మకొండ 54వ డివిజన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు.









నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ పరిధిలోని హనుమకొండ సర్కిల్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షాల వలన ఈదురు గాలులకు చెట్లు లైన్ల పైపడి 33 కెవి ఫీడర్ , 11 కెవి ఫీడర్ పరిధిలో 9స్తంబాలు, 8ట్రాన్స్ఫార్మర్లు నెలకొరిగాయాయని, 11ఇన్సులేటర్లు దెబ్బతిం్నాయని, సార్వత్రిక ఎన్నికలకు ఎలాంటి విద్యుత్తు అంతరాయం లేకుండా విద్యుత్ పున్నరుద్ధరణ పనులు చేపట్టి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని కె. వెంకటరమణ, సూపెరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు. అకాల వర్షాల వలన మొదట ప్రభావం చూపేది విద్యుత్ శాఖపైనేనని, నష్ట పోయేది కూడా విద్యుత్ శాఖ అని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి విధుల్లో



ఉంటూ ఆహర్నిశలు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేసారని, వారి ఎనలేని కృషికి అభినందనలు తెలిపారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్వయంగా కార్పొరేట్ కార్యాలయం నుండి లోడ్, విద్యుత్ సరఫరా మానిటరింగ్, చేస్తూ ప్రతి ఒక్క సర్కిల్ ఎస్ఈ, డిఈలతో మాట్లాడి అనుక్షణం వారికి సలహాలు, సూచనలను చేస్తూ వారిలో ఆత్మస్థైరం నింపుతూ, నేటి సార్వత్రిక ఎన్నికలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ పున్నరుద్ధరణకు దోహదపడింది అని అన్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24గంటలు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు . విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు.1800 425 0028 కు లేదా 1912 కు ఫోన్ చేయగలరని కోరారు.



సీబీఎస్ఈ ఫలితాల్లో 'ఏకశిల' ప్రభంజనం

నవతెలంగాణ-హసన్‌పర్తి

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సోమవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఏకశిల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చి ప్రభంజనం సృష్టించినట్లు ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు వరుసగా 483, 479, 479, 478, 477, 476 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాలు ప్రకటించిన అనంతరం అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రకటించిన ఇంటర్, స్టేట్-పదో తరగతితో పాటు సీబీఎస్ఈలోనూ ఏకశిల విద్యార్థులు రాణించడం మా ఏకశిల విద్యా సంస్థలకే గర్వనీయమన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు భవిష్యతులో కూడా రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యా సంస్థల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కేడి.స్వర్ణరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ధర్మసాగర్

ప్రమాదవశాత్తు రిజర్వాయర్లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల రాజన్న జిల్లా కేంద్రానికి చెందిన వల్లపు వెంకటేష్ (35),అత్తగారి ఊరు ధర్మ సాగర్ మండల కేంద్రంలో అతని తల్లిదండ్రులు చని పోవడంతో ఎనిమిది సంవ త్సరాల నుండి ఇక్కడే నివసి స్తున్నారని, మృతునికి మూర్చ రోగం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో ఉదయం రిజర్వాయర్ దగ్గరికి మలవిసర్జనకు వెళ్లగా అతనికి మూర్చ వచ్చిరిజర్వాయర్లు పడి మతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



ఆకర్షణీయంగా మోడల్ పోలింగ్ కేంద్రాలు

నవతెలంగాణ-నడికూడ

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఓటర్లను ఆకట్టుకునేలా నడికుడలో ఉమెన్స్ మోడల్ పోలింగ్ స్టేషన్, ధర్మారం గ్రామంలో ఉమెన్స్ మోడల్ పోలింగ్ స్టేషన్, చర్లపల్లి గ్రామంలో రూరల్ మోడల్ పోలింగ్ స్టేషన్, రాయపర్తి గ్రామంలో డిజేబులిటీ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లను మోడల్ పోలింగ్ స్టేషన్లు ఆకర్షించేలా పోలింగ్ కేంద్రం సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తీర్చిదిద్దారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను చూసిన ఓటర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు.మోడల్ ఉమెన్స్ పోలింగ్ కేంద్రంలో ఉమెన్స్ పోలింగ్ అధికారులకు రుమాలతో ఓటర్లను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్ది మహిళా ఓటర్లకు ఒక పువ్వు ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ ఉమెన్స్ పోలింగ్ అధికారులు ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఏసిపి కిషోర్ కుమార్ మండలంలోని పోలింగ్ కేంద్రాల ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఎన్నికల సెక్టార్ అధికారులు, అలాగే గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి

ఎంపీ స్వతంత్ర అభ్యర్థి మంద నరేష్

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని గోవిందాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో వరంగల్ జిల్లా జడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలోని పెద్దకోడపాక గ్రామానికి చెందిన పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి మంద నరేష్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రగతి సింగారం గ్రామంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పోలింగ్ సరళిని పరిశీలించిన అరూరి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.



అక్రమంగా నిల్వ ఉంచిన బొగ్గు పట్టివేత

నవతెలంగాణ-మల్హర్‌రావు

కాటారం మండలంలోని విలసాగర్ గ్రామంలో ఉన్న ఇటుక బట్టీల్లో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన సింగరేణి బొగ్గును పట్టుకుని సీజ్ చేసినట్లుగా భూపాలపల్లి ఏరియా సింగోంణి సెక్యూరిటీ ఆఫీసర్, జూనియర్ ఇన్స్పెక్టర్ లింగయ్య, ఇంటలిజెన్స్ సెక్యూరిటీ గార్డు దేవేందర్ తెలిపారు. సోమవారం ఇటుక బట్టీలపై తనిఖీ చేయగా ఇటుక బట్టి యజమాని దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఇటుక బట్టి యజమాని, సూపర్వైజర్‌పై కాటారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. ఈ సంఘటనపై సింగరేణి, పోలీస్ అధికారులు విచారణ చేపట్టినట్లుగా తెలిపారు.



బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకుల దాడి

తీవ్రంగా గాయపడ్డ బీఆర్ఎస్ నాయకులు
న్యాయం చేయాలంటూ
పోలీస్‌స్టేషన్ ముందు బీఆర్ఎస్ ధర్నా రాస్తారోకో

నవతెలంగాణ-పరకాల

పార్లమెంటరీ ఎన్నికల ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని నాగారం గ్రామంలో సోమవారం సాయంత్రం సుమారు 5గంటల ప్రాంతంలో స్థానిక పోలింగ్ బూత్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నేతలపై దుర్భాషలాడుతూ కర్రలతో మెరుపు దాడి చేయడంతో బీఆర్ఎస్ నాయకులు చిట్టిరెడ్డి రత్నాకర్‌రెడ్డి, చిట్టిరెడ్డి సాంబరెడ్డి, గుండెబోయిన నాగయ్య, ఏరుకొండ శ్రీనివాస్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు పరకాల పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించా ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సీఐ రవిరాజు అక్కడకు చేరుకని దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసుల ముందే బీఆర్ఎస్ నాయకులపై దాడి చేస్తుండగా కనీసం వారు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ ధర్నా చేస్తామని భీష్మించుకుని కూర్చున్నారు. అదే గ్రామానికి చెందిన మహిళా నాయకురాలు పల్లెబోయిన భాగ్యమ్మను మహిళా అని చూడకుండా దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ భర్త దేవేందర్‌రెడ్డితో తమకు ప్రాణభయం ఉందని, గ్రామంలో ఆయన గూండా రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి తెలపడంతో హుటాహుటిన పరకాల పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని విషయంపై ఆరా తీసి స్థానిక సీఐని గొడవ వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసేంత వరకూ ధర్నా విరమించమన్నారు.



ఎన్నికల నిర్వహణ సహకరించాలని, ధర్నా చేయడం ఎన్నికలకు విరుద్ధమని సీఐతో పాటు ఎస్సై స్థానిక పోలీసులు ఎంత చెప్పినా వినకపోవడంతో మరింత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. .ఈ విషయంపై పోలీసులు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు ఎలాంటి గొడవ మళ్లీ జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తలు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పెద్దాపూర్ గ్రామంలోని ఓటర్లకు ప్రచారం చెసే సందర్భంగా కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. కొలగాని రవి అనే కాంగ్రెస్ కార్యకర్తను బీఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలు వేలుపుల సురేష్, ఒర్రే రాజు, ఒర్రే కరుణాకర్, రవి ఒకరిపై ఒకరు దూషించుకుంటు తోపులాడుకున్నారు. ఈ ఘటనలో రవి కింద పడగా గాయమైంది. ఈ సంఘటన పై ఇరువర్గాల వారు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు.

రెండు చోట్ల మొరాయించిన ఈవీఎంలు



నవతెలంగాణ-శాయంపేట

వరంగల్ పార్లమెంటు పోలింగ్ ప్రక్రియ మండల పరిధిలోని 24 గ్రామాలలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో మాక్ పోలింగ్లో వీవీ ప్యాడ్ మొరాయించడంతో మరొకటి మార్చి ప్రక్రియ కొనసాగించారు. ప్రగతి సింగారం గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో సుమారు పది నిమిషాలు పోలింగ్ ప్రక్రియ నిలిచింది. అధికారులు సరిచేసి పోలింగ్ ప్రక్రియను కొనసాగించారు. పోలింగ్ సరళిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సందర్శించి పరిశీలించారు. వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి గోవిందాపూర్, పెద్దకోడపాక గ్రామాలలోని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరకాల ఏసిపి కిషోర్ కుమార్, సిఐ రంజిత్ రావు, ఎస్సై ప్రమోద్ కుమార్ పోలీస్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు. ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

హసన్‌పర్తి : మండల పరిధిలోని అర్వపల్లి, చింతగట్టు కెనాల్ క్యాంప్ 56, 57 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం వరకు సజావుగా సాగిన ఓటింగ్ ఒక్కసారిగా ఓటింగ్ మిషన్ మొరాయించడంతో గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు ఇంటికి తిరుగు పయనం అవుతుండగా సంబంధిత పోలింగ్ కేంద్రాల అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారం అదించారు. దీంతో జిల్లా ఎన్నికల అధికారితో పాటు స్థానిక తహశీల్దారు చల్ల ప్రసాద్ హుటాహుటిన పోలింగ్ కేంద్రాలకు చేరుకొని టెక్నీషియన్ సహాయంతో ఓటింగ్ మిషన్‌ను సరి చేసి ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేసినట్లు పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారులు వెల్లడించారు.

పార్లమెంట్ పోలింగ్ ప్రశాంతం

నవతెలంగాణ-హనుమకొండ

లోక్ సభ ఎన్నికలు హనుమకొండ జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న హనుమకొండ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలైన పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు ఉదయం నుండే ఓటర్లు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పరకాల నియోజకవర్గం పరిధిలో 239 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,22,383 మంది ఓటర్లు ఉన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 244 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,83,446 మంది ఓటర్లు ఉన్నారు. పరకాల నియోజకవర్గం పరిధిలో 1,70,925 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ శాతం 76.86గా నమోదయింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలో 1,49,294మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ శాతం 52.67గా నమోదైంది. హనుమకొండ జిల్లాలో 64.76 పోలింగ్ శాతం నమోదయింది.

ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్

సోమవారం నిర్వహించిన పోలింగ్లో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కంట్రోల్ రూమ్ నుండి పోలింగ్ సరళిని పర్యవేక్షించిన కలెక్టర్

హనుమకొండ జిల్లాలోని రెండు నియోజకవర్గాలైన పరకాల, వరంగల్ పశ్చిమలోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని జిల్లా అధికారులతో పాటు అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, వెంకట్‌రెడ్డిలతో కలిసి హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. ఎన్నికల అధికారులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేయగా జిల్లా ఎన్నికల అధికారి ఈ ప్రక్రియను పరిశీలించారు.

భారీ వర్షంతో అతలాకుతలం

నేల వాలిన వరి పంట, తడిసిన ధాన్యం,
నేరేడుపల్లెలో లేచిపోయినపైకప్పు రేకులు,
పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్

నవతెలంగాణ-శాయంపేట

మండల పరిధిలోని గ్రామాలలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అన్నదాతలు అతలాకుతలమయ్యారు. చేతికి అంది వస్తుందనుకున్న వరి పంట నేల వాలింది. చేతికి అందివచ్చిన మొక్కజొన్న, వరిధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాలలో పేరుకుపోయిన వరిధాన్యం, తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిచి పోయాయి. సోమవారం రైతులు తడిసిన ధాన్యాన్ని, మక్కలను ఆరబెట్టుకుంటూ ఉండడంతో ఎన్నికల పోలింగ్ శాతం తగ్గిపోయింది. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో తడిసిన ధాన్యాన్ని సోమవారం సిపిఎం మండల నాయకులు చిలకల కొమురయ్య సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో సమగ్ర సర్వే చేపట్టి పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 50,000 చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లేచిపోయిన పైకప్పు రేకులు

మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి చెందిన ముష్కే లక్ష్మీ ఇంటి పైకప్పు రేకులు ఆదివారం రాత్రి కురిసిన గాలి దుమారం, భారీ వర్షానికి లేచి ఎగిరి అవతలపడ్డాయి. లక్ష్మీ భర్త బుచ్చయ్య, కుమారుడు మరణించడంతో ఆమె ఒక్కతే రేకుల ఇంట్లో నివసిస్తుంది. ఆదివారం రాత్రి ఇంట్లో ఉండగా గాలి దుమారానికి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. ఎలాంటి ప్రాణం నష్టం సంభవించలేదు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మోత్కూరి భాస్కర్ ఆమెను పక్క ఇంట్లో ఆశ్రయం కల్పించాడు. భోజన వసతి సమకూర్చాడు. ఈ విషయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చాడు.



దామెర : మండలంలో కురిసిన అకాల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, వరి ధాన్యాలు తడిసి ముద్దయినాయి. ఈ నేపథ్యంలో గాలితో కూడిన వర్షం ఒక్కసారిగా రావడం వల్ల తమకు అపార నష్టం జరిగిందని రైతులు వాపోయారు.

ఆత్మకూరు : ఆత్మకూర్ మండలంతో పాటు తిరుమల గిరి, గ్రామాల్లో ఆరుతడి పంటగా రైతులు మొక్కజొన్న పంటను పండించారు. పంట చేతికి వచ్చిందని మురిసిన రైతుకు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కన్నీరె మిగిల్చింది, రోడ్డుపై మొక్కజొన్న అరబోయగా భారీ వర్షానికి జొన్నలు తడిసి ముద్దయ్యాయి. అరబోసిన పంట చేతికందకుంట పోయిందని వర్షానికి కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

హసన్‌పర్తిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

బీజేపీ కార్పొరేటర్‌తో పాటు పలువురిపై కేసు నమోదు
వివరాలు వెల్లడించిన ఇన్ స్పెక్టర్ సురేష్

నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్ పర్తి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులపై ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేష్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తిలో ఓటింగ్ జరుగుతున్న సమయంలో 144సెక్షన్ అమలులో ఉండగా ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ పార్టీకి చెందిన పలువురు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద ఎన్నికల ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకొని బీజేపీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వర్ రావు, శీలం బిక్షపతి, దాసరి రాజులతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్ స్పెక్టర్ సురేష్ వెల్లడించారు.

సీబీఎస్ఈ ఫలితాలో జిల్లా టాపర్ సాత్విక

నవతెలంగాణ-హనుమకొండ

హనుమకొండ హంటర్ రోడ్ లోని వరంగల్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న సాత్విక సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ ఫలితాలో 500మార్కులకు గాను 491 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. హనుమకొండ పోలీస్ స్టేషన్లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ కూతురు సాత్వికను పలువురు అభినందించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ- హన్మకొండ

వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హనుమకొండ బూత్ నంబర్ 223లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్తు

ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి

నవ తెలంగాణ-హసన్‌పర్తి

ఓటు విలువ ఎంతో విలువైనదని, ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధార పడి ఉంటుందని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం స్వ గ్రామం నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, ఆయన సతీమణి సువిజారెడ్డి, కుమారుడితో కలిసి ఓటు వేసి హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువకున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకున్నప్పుడు దేశ భవిష్యత్తు నిర్ణయిస్తుందన్నారు. ఎన్నికలు జరిగినప్పుడు ప్రజాస్వామ్య పద్దతిలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు.



ముగిసిన శివ మార్కండేయ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శివ మార్కండేయ ఆలయంలో శ్రీ ఏకాదశ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం 4వ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సోమవారం భద్రకాళి దేవస్థానం అర్చకులు గణేష్ ఆత్రేయ శర్మ, దుర్గా సాయి శర్మ ప్రద్యుమ్నా శర్మ, అచ్యుత్ శర్మ, సాయి ప్రణీత్ శర్మ, సాయి రాజేష్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య షష్ఠి సుదర్శన హోమం, చండీ హోమం, పూర్ణాహుతి, ధ్వజావరోహనం, చక్రస్నానం కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ దంపతులు పండిత సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బాసాని చంద్రప్రకాష్, ఆలయ అర్చకులు మార్త రాజకుమార్, తాటి రమేష్, చిందం కర్నాకర్, గ్రామస్తులు బాసాని వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, సదాశివుడు, చంద్రమౌళి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.



మోడ్రన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు దలీబన్

నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు మండల కేంద్రంలోని 104,105, ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల వ్యయ పరిశీలకులు కే దలీబన్ సోమవారం సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బతుకమ్మ, మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏర్పాట్లపై అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తాసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎస్సై రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.



వయోవృద్ధుల ఓటరు నమోదు 93.55 శాతం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

లోక్‌సభ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధుల పోలింగ్ శాతం 93.55గా నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా మూడు నియోజకవర్గాల వారీగా మొత్తం 869 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 16,383 దివ్యాంగ ఓటర్లకు గాను, 15,579 ఓట్లు పోలవగా, 95.12 శాతం నమోదైనట్లు వివరించారు. అదే విధంగా 6,844 (85) ఏళ్ల పైబడిన వయోవృద్ధుల ఓటర్లకు గాను, 6,151 ఓట్లు పోలవగా 90.03 శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మొత్తం 23,227 దివ్యాంగులు, 850 వయోవృద్ధుల ఓటర్లకు గాను, 21,730 ఓట్లు పోలవగా, 93.55 శాతం నమోదైనట్లు తెలిపారు.





పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి

నవతెలంగాణ-కొడకండ్ల

మండలం కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సందర్శించి పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఓటు హక్కును ఎవరికి భయపడకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ సురేష్

నవతెలంగాణ-కొడకండ్ల

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలోని రామవరం, రామన్నగూడెం చెరువు, ముందండ లక్ష్మక్కపెల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీసీపీ సురేష్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, కొడకండ్ల ఎస్సై శ్రవణ్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

మండలంలోని 21 గ్రామపంచాయతీలో ప్రజలతోపాటు ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రనిధులు, మాజీ ప్రజాపతినిధులు, మండలాధ్యక్షులు తమ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ముగిసిన పార్లమెంట్ ఎన్నికలు

నవతెలంగాణ-నర్మెట్ట

మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా గ్రామంలో 175, 174, 173 పోలింగ్ బూత్‌లో గంట పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పార్టీలకు సంబంధించి డబ్బులు తమకు అందలేదని మలకపేట్ గ్రామంలో గడ్డం ఎల్లయ్య వ్యక్తి పోలింగ్ బూత్‌కు వచ్చి తిరిగి వెళ్లి పోయారు. అనంతరం మళ్ళీ తిరిగి వచ్చి ఓటు వేశారు. కొత్తగా ఓటు వచ్చిన వారు సంతోషంగా ఓటును వినియోగించుకున్నారు. మలకపేటలో పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఆలంకరించారు.

తొలిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



తొలిసారిగా ఓటుహక్కును కలిగి ఓటు వేసుకునే అవకాశం రావడం సంతోషంగా ఉందని, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే నాయకులకు ఓటు వేస్తానని, విద్య, ఉపాధి, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసేవారికి అందరూ అండగా నిలవాలంటూ మండల కేంద్రానికి చెందిన వ్యాపారి పోకల రవి కూతురు డాక్టర్ పోకల యామిని తొలిసారి తన ఓటు హక్కు వినియోగించుకుని అన్నారు.



పిడుగుపాటుకు మూడు లక్షల అస్తి నష్టం

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఆదివారం పిడుగు పడడంతో వరి ధాన్యం కొనుగోలు చేసే గోనే సంచుల గోదాంలోని 2 వేలు గోనెసంచులు, 13 టార్పినులతో పాటు వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన మిషనరీలు కాలిపోయినట్లు మండలంలోని ఏళ్లరాయానీ తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి ఎం.రణధీరు తెలిపారు. 2 లక్షల 38 వేల రూపాయల విలువగల గోనే సంచులు, 33 వేల రూపాయల విలువ గల టార్పలిన్లు, దాదాపు రెండు లక్షల రూపాయల విలువగల వాటర్ ప్లాంట్ సామాగ్రి అగ్నిలో దగ్ధమైనట్లు వారు తెలిపారు. అర్ధరాత్రి ఫైర్ ఇంజన్ వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు చల్లార్చారు. అప్పటికే మంటలలో ఆస్తి నష్టం మొత్తం జరిగిందని అన్నారు. సమాచారం తెలుసుకున్న జిల్లా సహకార సంఘం కోపరేటివ్ ఆడిట్ అధికారి జి.మురళి రమణ పరిస్థితిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ స్టాఫ్ సిహెచ్. రాజేందర్, సెంటర్ ఇన్చార్జి బి.నాగరాజు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీపీ దంపతులు

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం లోని నెల్లుట్ల గ్రామంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎంపిపి దంపతులు చిట్ల జయశ్రీ ఉపేందర్ రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జనగామ జిల్లాలో 74.86 శాతం పోలింగ్

- పలుచోట్ల ఉద్రిక్తత, గ్రామస్తులపై లాఠీచార్జి
- ఈవీఎంలలో అభ్యర్థుల భవిష్యత్

నవతెలంగాణ-జనగామ

జనగామ జిల్లాలో పార్లమెంటు ఎన్నికల్లో ముగిశాయి.రెండు మూడు సంఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. జిల్లాలోని వరంగల్, భువనగిరి పార్లమెంటు పరిధిలోని స్టేషన్‌ఘన్పూర్, పాలకుర్తి, జనగామ నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 74.86 శాతం ఓట్లు పోలయ్యాయి. ప్రధానంగా జనగామ నియోజకవర్గంలోని గానుగుప్పపాడు గ్రామంలో పోలీసులు గ్రామస్తులపై లాఠీచార్జిచేయగా నిరసిస్తూ గ్రామస్తుల ఆందోళన చేపట్టారు. అలాగే జనగామ పట్టణంలోని ధర్మకంచ జెడ్పీ హైస్కూల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కొమ్మూరు ప్రతాపరెడ్డికి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. అలాగే పాలకుర్తి నియోజకవర్గంలోని దర్గపల్లి మల్లంపల్లి గ్రామాలలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎన్నికల పరిశీలన కోసం వచ్చినప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. అలాగే స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గంలోని నష్కల్ 103వ బూతులో ఈవీఎంలు సుమారు గంటసేపు మొరాయించాయి. ఈ సంఘటనలు మినహా జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పవచ్చు.ఈవీఎంలను భువనగిరి పార్లమెంటు పరిధిలోని భువనగిరి పట్టణ కేంద్రానికిని, వరంగల్ పార్లమెంటు పరిధిలోని ఈవీఎంలను జిల్లా నుంచి ఏనుమాముల మార్కెట్ యార్డుకు అధికారులు తరలించారు.

జిల్లాలో ఆయా నియోజకవర్గాలలో ఓటింగ్...

జనగామ జిల్లాలోని జనగామ నియోజకవర్గంలో 74.69 శాతం, స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 78.54 శాతం, పాలకుర్తి నియోజకవర్గంలో 71.35 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం మూడు నియోజకవర్గాలలో 7,52,395 మంది ఓటర్లు ఉండగా 5,63,218 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని జనగామ నియోజకవర్గంలో 2,42,771 మంది ఓటర్లకు గాను 1,81,728 మంది ఓటు వేశారు. అలాగే స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో 2,54,110 మంది ఓటర్లు ఉండగా 1,99,581 మంది ఓటర్లు సద్వితమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గంలో మొత్తం 7,52,395 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,82,309 మంది ఓటర్లు ఓటు వేశారు. జిల్లాలో ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పర్యటించి పరిశీలించారు. జిల్లాలో డీసీపీ సీతారామ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును నిర్వహించారు.

ధర్మకంచిలో ఎమ్మెల్యే పల్లా, కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిల మధ్య తీవ్ర వాగ్వావాదం - గానుగుపహాడ్‌లో లాఠీచార్జి - ఆందోళన

పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జనగామలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులు కొమ్మూరు ప్రతాపరెడ్డి తనయుడు కొమ్మూరు ప్రశాంత్ రెడ్డిల మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నక్రమంలో జనగామపట్టణంలోని ధర్మకంచి జెడ్పి హైస్కూల్లో 162 వ పోలింగ్ స్టేషన్లోకి కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి ప్రశాంత్ రెడ్డి అక్రమంగా బూతులోనికి వచ్చారని బీఆర్ఎస్ ఏజెంట్ అభ్యంతరం తెలిపారు.





నువ్వు ఎవరు ఆపడానికి నేను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఏజెంట్ అని ప్రశాంత్ రెడ్డి అనడంతో ఏజెంట్ కార్డు చూపించాలని బీఆర్ఎస్ శ్రేణులు పట్టుబట్టారు. దీంతో అక్కడున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడికి చేరుకున్నారు. అనధికారికంగా ప్రైవేటు వ్యక్తుల్లోనికి వెళ్లడం అప్రాజాస్వామికమని ప్రశాంత్ రెడ్డి పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కొమ్మూరు ప్రశాంతి రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురిని శాంతింప చేసేందుకు ప్రయత్నం చేశారు.

గానుగుపాడులో పోలీసుల లాఠీచార్జి

జనగామ మండలంలోని గానుగుపాడు గ్రామంలో పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలింగ్‌బూత్‌కు దూరంలో గ్రామస్తులు గుమికూడారని చెదరగొట్టేందుకు లాఠీచార్జీ చేయడం సరైంది కాదని గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అకారణంగా తమపై లాఠీచార్జ్ చేసిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని గ్రామస్తులు ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చిన తోమను పోలీసులు అకారణంగా కొట్టడం అప్రజాస్వామికమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు చెబుతుంటే ఓటు వేసేందుకు వస్తున్న ప్రజలను పోలీసులు చితక బాధడం ఇదెక్కడి అన్యాయం అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. లాఠీచార్జీ చేసిన పోలీసులను సస్పెండ్ చేసేంతవరకు ఆందోళన విరమించేది లేదని గ్రామస్తులు పోలింగ్ స్టేషన్ దూరంలో బైఠాయించారు. దీంతో విషయం తెలుసుకున్న అధికారులు పోలీసు ఉన్నతాధికారులు గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

జనగామ జిల్లాలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు, పోలింగ్ దృశ్యాలు



యువత ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నవతెలంగాణ-మహబూబాబాద్

దేశ భవిష్యత్తును నిర్దేశించే భావి భారత యువత ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటేందుకు తరలివచ్చి తమఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మహబూబాబాద్ పట్టణంలోని కట్టెలమండే ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుని మాట్లాడారు. భావిభారత యువత రాజకీయాల్లోకి రావాలని మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు రాజకీయాలు అధ్యయనం చేయాలన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండు సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రభుత్వ ఉద్యోగ రంగంలో స్థిరపడానికి సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ యూనివర్సిటీల నుంచి వచ్చిన విద్యావంతులైన యువత లౌకికవాదం, సార్వభౌమాధికారం,సెక్యులరిజం, సమాజంపై అధ్యయనం చేసే వారని అన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలో పుట్టగొడుగుల పుట్టుకొచ్చి యువతను సమాజానికి దేశ భవిష్యత్తు రాజకీయాలకు దూరం చేస్తున్నాయని విశ్లేషించారు. గల్లి నుంచి ఢిల్లీ స్థాయి వరకు దేశ భవిష్యత్తును అభ్యున్నతిని, ఆర్థిక స్థిరత్వాన్ని నిర్దేశించేది రాజకీయాలేనని అన్నారు. రాజకీయాలలో చదవడానికి అధ్యయనం చేయడానికి దూరంగా ఉన్న యువత కనీసం ఓటు హక్కును అయినా వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తినిచాటాలని కోరారు. కొన్ని పోలింగ్ బూత్ల వద్ద 60 సంవత్సరాలు 70, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు కాలి నడకన వచ్చి పాదరక్షలు లేకుండా వచ్చి మండు ఎండలో వచ్చి ఓటు వేసి తమ బాధ్యతను చాటుతున్నారని, హక్కును భవిష్యత్తులో నిలబెట్టుకోవడానికి స్ఫూర్తినిస్తున్నారని అన్నారు. ఎన్నో వేల మంది ప్రాణ త్యాగాలపై వచ్చిన స్వాతంత్రాలను ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి యువత ముందుకు రావాలని సాదుల శ్రీనివాస్ కోరారు.





మల్లేశం విజయం ఖాయం : ఎమ్మెల్యే పల్లా

నవతెలంగాణ-బచ్చన్నపేట

భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశం విజయం ఖాయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన ఎన్నిక సరళిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని భయంతోటే కాంగ్రెస్ నాయకలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్రి రమణారెడ్డి, గంగం సతీష్ రెడ్డి, బుడియన్ చంద్ర రెడ్డి, దూడల కనకయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్ర సమీపంలోనే ప్రచారం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో భాగంగా సోమవారం చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో ఎన్నికల పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్ఎస్ పార్టీ కండువా, బ్యాలెట్ నమూనాతో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం చేశారు.



పోలింగ్ సరళిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగాలఘనపురం

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలోని చీటూరు, కుందారం గ్రామాలలో పోలింగ్ సరళిని సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పరిశీలించి పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు.





పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థి కావ్య

నవతెలంగాణ-లింగాలఘనపురం

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి సింగపురం ఇందిరా సోమవారం సందర్శించి పరిశీలించారు. మండలంలోని నెల్లుట్ల, కళ్లెం మండల కేంద్రాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి సరళిని పరిశీలించారు. పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడి పోలింగ్ వివరాలను తెలుసుకున్నారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. వీరి వెంట జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, ఎంపిటిసి బిక్షపతి, మాజీ సర్పంచ్ విజయమనోహర్, దేవస్థానం చైర్మన్ మూర్తి మోహన్, ఉప్పలయ్య, ఆంజనేయులు, గంగాధర్, రాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

తొర్రూరు మండలంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. సోమవారం ఉదయం 7 గంటల నుండి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు వేసేందుకు క్యూ లైన్లో నిలబడి ఉత్సాహం చూపారు. ఎక్కువ శాతం మహిళలు, యువత ఎంపి ఎన్నికల కోసం ఓటు వేసేందుకు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మిగితా ఓటర్లతో పాటూ క్యూ లైన్లో నిలబడి ఓటు వేశారు. అనంతరం ఓటింగ్ సరళిని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రతి ఒక్క ఓటర్‌ను పోలింగ్ కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడున్న నాయకులకు కార్యకర్తలకు సూచించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. వరంగల్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్ సైతం పట్టణంలోని పలుకే పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని స్వయంగా పర్యవేక్షించారు. ఏలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందులో తాగునీటీ సౌకర్యం, వికలాంగులకు ఓటు వేయడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, వైద్య సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు.



రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నవతెలంగాణ-తొర్రూరు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణంలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ రెడ్డి, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



నవతెలంగాణ-గంగారం

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన ఛత్తీస్‌ఘడ్, ములుగు జిల్లా అటవీ ప్రాంతానికి అతి దగ్గరలో ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన దుబ్బగూడెం, కామారం, గంగారం పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ సందర్శించి ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచనలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ఈ కార్యక్రమంలో గూడూరు సీఐ బాబురావు, గంగారం ఎస్ఐ రవికుమార్, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



తోట బిక్షం స్పూర్తితో... కార్మిక పోరాటాలు ఉధృతం చేయాలి

- సీపీఎం, సీఐటీయూ నేతల పిలుపు

నవతెలంగాణ-మహబూబాబాద్

కార్మిక పక్షపాతి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తోట బిక్షం స్పూర్తితో కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. సోమవారం తోట బిక్షం తృతీయ వర్ధంతిసభకు సీఐటీయూ పట్టణ కన్వీనర్ కుమ్మరికుంట్ల నాగన్న అధ్యక్షత వహించారు. మొదట బిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సభలో వారు మాట్లాడుతూ నేడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం వారి పోరాటాలకు అండదండగా నిలబడడమే బిక్షంకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సమ్మెట రాజమౌళి, యమగాని వెంకన్న, గాడిపల్లి శ్యామ్, ఎర్ర శీను, దర్గయ్య బిక్షం కుటుంబ సభ్యులు తోట శ్రీనివాస్, తోట యాకయ్య పాల్గొన్నారు.

తోట బిక్షం నగర్‌లో అన్నదానం...

తోట బిక్షం వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు దేవత్ హేమానాయక్, తజ్జు, మందుల మహేందర్, ఎండీ రషీద్ పాల్గొన్నారు.



తోట బిక్షం ఆశయాన్ని ముందుకు తీసుకుపోవాలి : సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నిరుపేద వర్గాల అభివృద్ధి, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన సీపీఎం నాయకులు తోట బిక్షం ఆశయాన్ని ముందుకు తీసుకుపోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తోట బిక్షం మూడవ వర్ధంతిని వ్యవసాయ మార్కెట్ స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల కోసం కష్టజీవుల కోసం పోరాడిన మహనీయుడు అన్నారు. ముఖ్యంగా అసంఘటిత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసిన పోరాట నాయకుడు అన్నారు. నేటి యువతరం తోట బిక్షం ఆశయాన్ని ముందుకు తీసుకపోవడమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్, పట్టణ నాయకత్వం రావుల రాజు, చీపిరి యాకయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్, తోట యాకన్న, యమగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ బహిష్కరించిన చింతలగడ్డ తండా

నవతెలంగాణ-మరిపెడ

పోలింగ్ బూత్‌ను వేరే చోటికి మార్చటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ లోక్‌సభ ఎన్నికలను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చింతలగడ్డ తండా గ్రామపంచాయతీ వాసులు బహిష్కరించారు. గత 20 రోజులుగా అధికారులకు తెలియజేసిన తమ తండాకు బూత్ కేటాయించకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలియజేశారు. 267పైచిలుకు ఓట్లు తమ తండాలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజులుగా అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లమంటే వెళ్లమంటూ మొండికేసి తండాలోనే ఉండి పోయారు. దీంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ సైదులు, సీఐ హతిరాం నాయక్, ఎస్ఐ షేక్ తాహెర్‌బాబా తండాకు చేరుకుని ప్రజలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కానీ వారు ఎంత సేపటికి ససేమిర అనటంతో చేసేది లేక మరో మారు జరిగే ఎన్నికలకు ఉన్నతాధికారులకు తండా వాసుల అభ్యర్థనను ఫార్వర్డ్ చేసి బూత్ మంజూరైయ్యేలా చూస్తామని చెప్పి వెనుదిరిగారు. కాగా అధికారులు వెళ్లాక తండాకు చెందిన 15మంది రూప్ తండాలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసినట్లు సమాచారం.

పోలింగ్ పరిశీలించిన ఎంపీ అభ్యర్థులు

నవతెలంగాణ-బయ్యారం

మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి మాలోత్ కవిత, మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు సౌకర్యాలు, ఏమైనా ఇబ్బంది ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని భీమ్లాతండా బూత్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మోకాళ్ళ మురళీకృష్ణ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం బయ్యారంలో ఎన్నికల ఏజంట్ గౌని ఐలయ్యతో కలిసి బూత్‌ల ఎన్నికల నిర్వహణను పరిశీలించారు.

వడదెబ్బకు ఆరోగ్యం క్షీణించి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బయ్యారం



వడదెబ్బకు ఆరోగ్యం క్షీణించి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలోని సింగారం గ్రామానికి చెందిన సుర్నపాక జగ్గయ్య(59) రెండు రోజులుగా తునికాకు సేకరణకు వెళ్లి వడదెబ్బకు గురై ఆదివారం సాయంత్రం విరోచనాలతో సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

రిపోర్టర్‌పై దాడి...



మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా గతంలో వార్త రాశాడన్న కోపంతో సోమవారం ఓ దినపత్రిక మండల రిపోర్టర్ నాయిని ఇంద్రారెడ్డి పై సీపీఐ ఎంఎల్ ప్రజాపందా నాయకుడు, మాజీ మావోయిస్టు ముల్కురి జగ్గన్న అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. దీంతో సదరు రిపోర్టర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సాయంత్రం ఐదు గంటల వరకు...

ఆరు గంటల తర్వాత కూడా పోలింగ్ - అసెంబ్లీతో పోల్చితే తగ్గిన వైనం

మానుకోటలో 68.06 శాతం పోలింగ్







నవతెలంగాణ-మహబూబాబాద్

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గినట్లు కనిపిస్తుంది. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో ఓటింగ్‌లో పల్లె ప్రజలు ఉరుకులు పరుగులుతో వచ్చి క్యూ లైన్‌లో నిలబడి ఓటు వేయగా పట్టణ ప్రజలు బద్ధకించారు. పల్లెల్లో పోలింగ్ స్టేషన్లో కళకళలాడగా ఓటర్లు క్యూ లైన్లు బార్లుతీరగా పట్టణాలలో ఓటర్ లేక పోలీస్ స్టేషన్లో వెలవెల పోయాయి. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు, ఇల్లందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ స్థానాలలో సాయంత్రం నాలుగు గంటలకే పోలింగ్ ముగించారు. అటవీ ప్రాంతం అయినందున ఈవీఎంలు తరలించేందుకు వీలుగా సమయాన్ని తగ్గించారు. అలాగే మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట నియోజవర్గాలలో పోలింగ్ సమయాన్ని ఐదు గంటల నుంచి 6 గంటలకు పెంచారు. అయినప్పటికీ ఓటర్లు ముందుకు రాలేదు. ఏడు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా నర్సంపేట నియోజకవర్గంలో 73.01 ఓటింగ్ శాతం నమోదు కాగా భద్రాచలంలో 64.72 మాత్రమే నమోదైంది.ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఆరు నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందగా భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రావు గెలుపొందారు. అయితే ఆయన ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరారు.పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు పోలింగ్ చిట్టీల పంపిణీకి మెప్మా, గ్రామపంచాయతీ సిబ్బందికి అందుబాటులో ఉన్నారు.జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ప్రశాంతంగా ఎన్నికల ముగిశాయి. ఏడు నియోజకవర్గాలలో మొత్తం 1809 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 5 గంటల వరకు 101-డోర్నకల్ ఓటింగ్ శాతం 70.86, 102- మహబూబాబాద్ ఓటింగ్ శాతం 67.19, 103- నర్సంపేట ఓటింగ్ శాతం 73.01, 109-ములుగు ఓటింగ్ శాతం 67.92, 110-పినపాక ఓటింగ్ శాతం 65.91, 111-ఇల్లందు ఓటింగ్ శాతం 69.11, 119-భద్రాచలం ఓటింగ్ శాతం 64.72 నమోదైంది. మొత్తం పార్లమెంట్ పరిధిలో సాయంత్రం ఐదు గంటల వరకు 68.06శాతం పోలింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికలలో మహబూబాబాద్ అసెంబ్లీ పరిధిలో 75 శాతం పైగా పోలింగ్ నమోదు కాగా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 67.19 మాత్రమే నమోదైంది. అలాగే అసెంబ్లీ పరిధిలో డోర్నకల్ నియోజకవర్గంలో గత ఎన్నికలలో 79 శాతం పైగా పోలింగ్ నమోదు కాగా ఈసారి డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 70.86 మాత్రమే నమోదైంది. మొత్తం పార్లమెంట్ పరిధిలోని ఓటింగ్ శాతాన్ని మర్నాడు వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు.

పెద్దవంగర : మండలం మొత్తం మీద 73.04 పోలింగ్ శాతం నమోదు అయిందని అధికారులు వివరాలు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 24,986 ఓటర్లకు గాను, 18,252 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలో 31 పోలింగ్ స్టేషన్లు, 16 లోకేషన్స్, 3 సెక్టర్లను ఏర్పాటు చేశారు. అవుతాపురం గ్రామంలో ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన రాజు యాదవ్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ తీరును పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 85.3 పోలింగ్ శాతం నమోదు కాగా, పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో 12.26 పోలింగ్ శాతం తగ్గింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

మరిపెడ : మరిపెడ మునిసిపాలిటీ కేంద్రంలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలోని 224వ బూత్‌లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ ఓటు హక్కును వినియోగించున్నారు. మండలంలో 264 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం లోకసభ ఎన్నికలు సజావుగా జరిగాయి. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించటంతో అరగంట నుంచి 2గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గ వ్యాప్తంగా 70.80శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పూర్తి రిపోర్టు ఎన్నికల అధికారులు నేడు వెల్లడించనున్నట్లు సమాచారం. కాగా మరిపెడ మండలంలోని లూనావత్ తండాలో ఈవీఎంపై ఆకతాయి మార్కర్‌తో ఓ పార్టీ గుర్తు వద్ద రైట్ మార్క్ పెట్టడంతో ఏజెంట్లు గుర్తించి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఘటనపై స్పందించిన పోలింగ్ అధికారులు ఈవీఎంపై వేసిన మార్కును తొలగించి పోలింగ్ యథావిధిగా కొనసాగించారు. అదే విధంగా వీరారం గ్రామంలో సుమారు 2 గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన 19 కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల బయట కూడా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల వసతి గృహానికి తరలించారు.

తొర్రూరు : మండలంలో మొత్తం 74 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పాలకుర్తి నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 68.41 శాతం పోలింగ్ జరిగింది. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వరంగల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్, బీఎస్పీ అభ్యర్థి పంజా కల్పన, ఆర్‌పిఐ అభ్యర్థి గణపురం రామకృష్ణ పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు.

గార్ల : మండల వ్యాప్తంగా మొత్తం 30,399 మంది ఓవర్లకు గాను మండలంలోని 175 నుండి 205 వరకు ఉన్న బూత్‌లలో 21,603 మంది తమ ఓటు హక్కును వినియోగించు కోగా 71.06 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మండలంలోని ఇరవై గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఎస్సై జీనత్ కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసి జాటోత్ ఝాన్సీలక్ష్మీ, ఎంపిపి బట్టు నాగరాజు, పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, సిపిఐ రాష్ట్ర నాయకులు కట్టె బోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా నాయకులు కందునూరి శ్రీనివాస్, భూక్య హరిల అధ్వర్యంలో కూటమి అభ్యర్థికి నమోదు అవుతున్న ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు. బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి మాళోత్ కవిత, నాయకులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధాకృష్ణ, శీలం శెట్టి రమేష్, పులిచింతల వీరారెడ్డిల మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా పలు గ్రామాలలో పర్యటించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన కందునూరి లెనిన్ బొంబాయి సెంట్రల్ గవర్నమెంట్ లో సెబీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడినప్పటికి వీల్ చైర్ పై వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గూడూరు : మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలైన గుండెంగా, మట్టేవాడ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగింది. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని, భూపతిపేటలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలించారు. గూడూరు తహసిల్దార్ శ్వేత పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పొనుగోడు పోలింగ్ కేంద్రంలో ఓటు కోసం వచ్చిన ఓ మహిళ అస్వస్థకు గురికాగా వెంటనే 108 వాహనం ద్వారా తరలించారు. పోనుగోడు, గుండెంగ గ్రామాలలో ట్రై సైకిల్ ద్వారా వృద్దులు, వికలాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ఉపయోగించుకున్నారు. మండలంలో ఊట్ల, మడ్డెవాడ, కొంగరగిద్ద పోలింగ్ వద్ద పోలీసు బలగాలు మోహరించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ బాబురావు, ఎస్ఐ నగేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బయ్యారం : మండలంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సోమవారం ప్రశాంతంగా కొనసాగింది. మండలంలో ఉన్న ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని తాగునీరు, క్యూలైన్ల వద్ద టెంట్లు, టాయిలెట్ ఇతర వసతులు కల్పించారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్ళు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పారామెడికల్ బృందాలు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు స్థానిక పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు.

చిన్నగూడూరు : మండలంలో మొత్తం 12,925 ఓట్లు ఉండగా సాయంత్రం 6 గంటల వరకు 9,626 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని 10 గ్రామపంచాయతీలో ప్రశాంతంగా ఓట్లు జరిగాయి. ఆయా రాజకీయ పార్టీ నాయకులు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లను ద్విచక్ర వాహనాలపై, ఆటోలల్లో ,ట్రాక్టర్లలో తరలించారు. గ్రామాల నుండి పోలింగ్ ఈవీఎంలను నేరుగా పోలీస్ బందోబస్తు మధ్య మహబూబాబాద్ జిల్లాకు తరలించి స్ట్రాంగ్ రూములో భద్రపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కేసముద్రం రూరల్ : మండలంలోని కేసముద్రం మేజర్ గ్రామపంచాయతీ కేసముద్రం స్టేషన్ పోలింగ్ కేంద్రాలను, ఉప్పరపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను అభ్యర్థి మాలోత్ కవిత సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. ఆమె వెంట మం డల నాయకులు జాటోత్ హరీష్ నాయక్, వీరు నాయక్, మర్రి రంగారావు, మంచాల ఏకరాజ్యం, సోమ మధు, బండారు గోపీనాథ్, ఎసల్ల రాజు, అల్లి వీరయ్య పలుస ఉపేందర్ పాల్గొన్నారు. మండలంలోని అర్పణపెల్లిలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి అర్పణపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో మొదటిసారిగా ఓటుహక్కు పొందిన చాగంటి రఘు, వీరబోయిన కళ్యాణ్, గుడాల విక్రమ్, గుడాల కిరణ్, రాకేష్ మనోజ్ అవినాష్, మనోజ్, విక్కీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.









మానుకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు











నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఎస్పీ, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ మహబూబాబాద్ పట్టణంలోని పాతబజార్లో గుమ్మనూరు సెంటర్లోని ఎంఈఓ కార్యాలయ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 229 పోలింగ్ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.మానుకోటలోని మార్వాడి బజార్లో ఉన్న ప్రభుత్వ పారామిక పాఠశాల పోలింగ్ స్టేషన్ నెంబర్ 232లో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా రెవెన్యూ శాఖ అదనపు కలెక్టర్ డేవిడ్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో కుటుంబ సభ్యులతో సహా ఓటు వేశారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మానుకోటలోని పాత బజార్‌లోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తొర్రూర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఓటు వేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ నెహ్రూ నాయక్ మరికూడాలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేశారు. ప్రభుత్వ సలహాదారు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి కేసముద్రం మండలంలోని అర్పణపెల్లి గ్రామంలో తన సొంత గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామా సహాయం రఘురాంరెడ్డి మహబూబాబాద్ మండలం మాదాపురం గ్రామంలో తన సొంత గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మానుకోటలోని కంకరబోడు ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిన్నగూడూరు మండలం ఉగ్గంపేట గ్రామంలో తన సొంత గ్రామంలో ఓటు వేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు బయ్యారం మండలంలో ఓటు వేశారు. బీఆర్ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ తొర్రూరు మండలంలోని కర్కాల ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ సంస్థ డైరెక్టర్ మాలోతు నెహ్రూ నాయక్ సిరోల్ మండలం ఉప్పరిగూడెం ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి పాతబజార్‌లోని బాలికల పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మారినేని వెంకన్న మానుకోటలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. విశ్రాంత కలెక్టర్ అజ్మీర్ రామచంద్రనాయక్ సిరోలు గ్రామంలో ఓటు వేశారు. తేజావత్ బెల్లయ్య నాయక్ భానాపురం మండలం ధర్మారావుపేట గ్రామంలో ఓటు వేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మహపురం అంజయ్య మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని కంకర బోడు పాఠశాలలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.











ఓటు వేయడం సామాజిక బాధ్యత

ధన్వాడలో ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు



ఓటు భారం కాదని, ఓటును సామాజిక బాధ్యతతో వేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాటారం మండ లంలోని తన స్వగ్రామం ధన్వాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మంత్రి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలతో క్యూ లైన్‌లో నిలబడి ఓటు వేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైందని తెలిపారు.

దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ-ములుగు



ములుగు మండలంలోని జగ్గన్నపేటలో సోమవారం తన స్వగ్రామంలో మంత్రి సీతక్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సంద ర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవాలని చూసే పార్టీలకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు.దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల గ్రామ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



పటిష్ట భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్పీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంతో పాటు, ఘణపురం, రేగొండ, చిట్యాలలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి, పోలింగ్ సరళిని పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో భద్రత బలగాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలిసు అధికారులు, సిబ్బంది, సిఆర్పిఎఫ్ బీఎస్ఎఫ్, టిఎస్ఎస్‌పి, శిక్షణ కానిస్టేబుళ్లు, ఇతర శాఖల సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని అన్నారు.

చిట్యాల : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల వ్యాప్తంగా పోలింగ్ శాతం 71.56గా నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలోని హైస్కూల్లో ప్రత్యేకంగా ఓటర్లను ఆకర్షించేందుకు పోలింగ్ కేంద్రాన్ని ముస్తాబు చేశారు. మండలంలోని చల్లగరిగ, జూకల్, తిరుమలపూర్, చిట్యాల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ పి.కిరణ్ కారె పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే సత్యనారాయణరావు పరిశీలించారు.

గణపురం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం జిల్లా ఎస్పీ కిరణ్‌కారే పరిశీలించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని ఎస్సై మచ్చ సాంబమూర్తికి ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకూ ఉండి ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలన్నారు.



పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎండాకాలంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సౌకర్యం, టెంటు వికలాంగులకు వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. పలిమెల మండలంలోని అంబటిపల్లి, కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రామారావు, విజయకుమార్, సుస్మిత, సూపర్వైజర్ మనకలి, హెల్త్ అసిస్టెంట్లు సత్యనారాయణ, రాజారమణయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



భారీ వర్షంతో బురదమయంగా మారిన పోలింగ్ కేంద్రాలు

నవతెలంగాణ-గణపురం

వరంగల్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి ఎలాంటి అవంచనియ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ముగిసాయి పార్లమెంట్ ఎన్నికలకు యువకులు ఓట్లు వేసేందుకు భారీ సంఖ్యలో హాజరయ్యారు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని పోలింగ్ కేంద్రాలలో నీళ్లు నిలిచి బురదమయంగా మారాయి చెల్బూర్ పోలింగ్ కేంద్రంలో భారీగా నీళ్లు నిలిచాయి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మచ్చ సాంబమూర్తి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మొరాయించిన ఈవీఎంలు

ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

నవతెలంగాణ-టేకుమట్ల

మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని అంకుశాపూర్, సోమనపల్లి, టేకుమట్ల, గ్రామాలలో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు 40 నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

మల్హర్‌రావు : మండల వ్యాప్తంగా 22 పోలింగ్ బుతుల్లో మందకొడిగా 71.17శాతం మాత్రమే జరిగింది. గత ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 84.18 శాతం కాగా,పార్లమెంట్ ఎన్నికల్లో 13 శాతం ఓటింగ్ తగ్గింది. తాడిచెర్లలో బీఎల్ఓలు ముందస్తుగా ఓటింగ్ స్లిప్స్ ఇవ్వకపోవడంతో ఓటర్లు కొంత గందరగోళానికి గురైయ్యారు.తాడిచెర్ల హైస్కూల్‌లో ఉన్న ఈవీఎంలు అరగంట మొరాయించడంతో ఓటర్లు ఆందోళనకు గురైయ్యారు.

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం









భూపాలపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లిలో ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా కొనసాగింది. వరంగల్ ఎస్సీ నియోజకవర్గ పరిధిలోని భూపాలపల్లి శాసనసభ నియోజకవర్గంలో 65 శాతం పోలింగ్ జరిగింది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన భూపాలపల్లి జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో 62 శాతం పోలింగ్ నమోదు గాక ఈ ఎన్నికల్లో 65 శాతం నమోదు అయ్యింది. మూడు శాతం ఓటింగ్ పెరిగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు..

భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం బుద్దారంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సతీమణి పద్మ (గణపురం జెడ్పీటీసీ)తో కలిసి ఉదయం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు మండలాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్లమెంట్ వరంగల్ అభ్యర్థి సుధీర్ కుమార్‌తో కలిసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

క్యూలో నిలబడి ఓటు వేసిన జిల్లా కలెక్టర్..

జిల్లా కలెక్టర్ ఓటు సాంప్రదాయాన్ని పాటించారు. ఓటర్లతో కలిసి క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. లోక్‌సభ సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ పిఎస్ నెంబర్ 79లో ఓటర్లతో పాటు క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ఎస్పీ దంపతులు..

లోక్ సభ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ సమీపంలోని కుందూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

కడియం కావ్య గెలుపు ఖాయం

దేశంలో ఇండియా కూటమిదే అధికారం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నవతెలంగాణ-భూపాలపల్లి



వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటీచేసిన డాక్టర్ కడియం కావ్య లక్షా మెజార్టీతో గెలవటం ఖాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో పర్యటించి పోలింగ్ సర్వేలను పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...భూపాలపల్లి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 50వేల మెజార్టీ ప్రజలు ఇచ్చారని ఇప్పుడు సిపిఐఎం, సిపిఐ పార్టీల సహకారంతో లక్ష మెజార్టీ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ఇండియా కూటమి గెలవటం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం అనివార్యమన్నారు. ఆయన వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవాన్‌లతో పాటుఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతం.. తగ్గిన ఓటింగ్ శాతం

నవతెలంగాణ-మంగపేట



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పార్లమెంట్ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 25గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 50 పోలింగ్ కేంద్రాల్లో ఈ ఎన్నికలు సజావుగా జరిగాయి. గతంతో పోలిస్తే ఓటింగ్ శాతం భారీ స్థాయిలో తగ్గింది. ఓటింగ్ ప్రశాంతంగా జరగడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన బలరాంనాయక్

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మహబూబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాంనాయక్ సోమవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్నికలు జరుగుతున్న తీరును పరిశీలించారు. మండలంలోని చుంచుపల్లి, మంగపేట, కమలాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర

నవతెలంగాణ-గణపురం

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ కేంద్రాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. మండలంలోని గణపురం, బుద్ధారం, చెల్పూర్ బసవ రాజుపల్లి, ధర్మారావుపేట, పరుశురాంపల్లి గ్రామాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు

భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆయన సతీమణి జడ్పిటిసి గండ్ర పద్మతో కలిసి వారి స్వగ్రామం బుద్ధారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు.అంతకుముందు గ్రామంలోని శ్రీపర్వత వర్ధిని సహిత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.వారి వెంట గణపురం వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్ తదితరులు ఉన్నారు.

ఓటింగ్ సరళిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర, ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గణపురం మండలంలోని చెల్పూర్, లాక్మారెడ్డిపల్లి, గాంధీనగర్, మైలారం గ్రామంలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ పరిశీలించారు.

అకాల వర్షం..రైతన్న అతలాకుతలం

చేతికందే దశలో చేజారిన వరి పంట

రైతన్న కంట కన్నీరు

కోత దశలో దెబ్బతీసిన అకాల వర్షం

ఈదురు గాలులు భారీ వర్షానికి నేలమట్టమైన వరి పంట

మోరంచ వాగు వెంట నీట మునిగిన పంట పొలాలు

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

నవతెలంగాణ-గణపురం



చేతికందే దశలో వరి పంట చేజారింది. గత మంగళవారం కురిసిన అకాల వర్షంతో వరి కోతలు మరో 10 రోజులు ఆలస్యమయ్యాయి. మళ్లీ ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. మరో 15రోజులైతే మండలంలో వరి కోతలు పూర్తయ్యేవి. ఈ సమయంలోనే అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు వరి పంటలు పూర్తిగా నేలవాలయి. గత మంగళవారం కురిసిన వర్షాలతో వరి పంటలకు నష్టం వాటిలినప్పటికీ ఆదివారం రాత్రి గంటకు పైగా కురిసిన భారీ వర్షంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గణపురం మండల కేంద్రానికి చెందిన గోరంట్ల శేషగిరిరావు, ప్రశాంత్‌రావులకు చెందిన సుమారు 400బస్తాల ధాన్యం ఆరబోయగా అకాల వర్షానికి ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. మోరంచవాగు వెంట వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. నగరంపల్లికి చెందిన గొర్రె ఎల్లేశ్వర్‌యాదవ్‌కు చెందిన సుమారు 5ఎకరాల వరి పంట పూర్తిగా నీటిలో మునిగి మొలకలు వచ్చాయి. కోతలు పూర్తి చేసి ఆర పోసిన ధాన్యానికి గణపురం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే మండలంలో వరి కోతలు ప్రారంభమైనప్పటికీ వారం రోజుల్లో ఊపందుకొనున్నాయి. ప్రస్తుతం వరి పంటలు రైతులకు చేతికందే దశలో ఉండగా అకాల వర్షాలు కురవడంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



మల్హర్‌రావు : మండలంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయింది. కోతకు వచ్చిన పొలాలు గాలి బీభత్సంతో నెలపాలై తీరని నష్టం వాటిల్లిందని బాధిత రైతులు కన్నీరుమున్నీరయ్యారు. మండలంలో కొయ్యూర్, కొండంపేట, రుద్రారం, ఎడ్లపల్లి, వళ్లెంకుంట, మల్లారం, తాడిచెర్ల, పెద్దతూండ్ల గ్రామాల్లో వర్షం కురిసింది. రైతులు విక్రయించడానికి కల్లాల్లో అరబోసిన ధాన్యం కుప్పలు తడవుగా,గాలి బీభత్సంతో మామిడి తోటల్లో కాయలు నెలారాలాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నాలుగు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం,ఈదురు గాలులతో నష్ట పోయిన వరి, మామిడి రైతులను ప్రభుత్వం అదుకోవాలని బాధిత రైతులు వేడుకొంటున్నారు. వర్షంతో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

గోవిందరావుపేట :

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో యాసంగి పంటలు పండించిన రైతాంగం అతలాకుతలం అయ్యారు. వర్షానికి తోడు గాలి వీయడంతో వర్షం నుంచి ధాన్యాన్ని తడవకుండా కాపాడలేకపోయారు. ధాన్యాన్ని ఆరబోసిన ప్రాంతంలో ఎటుచూసినా అడుగులోతు నీళ్లలో రైతులు ఏమీ చేయలేక బోరున విలపించారు. కోటగడ్డ, పాపయ్యపల్లి, దుంపలగూడెం, పస్రా, గోవిందరావుపేట గ్రామాలలో ఇంకా కోయాల్సిన వరి పంటలు పూర్తిగా నేల వాలాయి. తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే ఖరీదు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

మహాదేవపూర్ :

మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలోని ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు వాపోయారు. కష్టపడి పండించిన దాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే , ఇదే కాక కొనుగోలు చేసిన ధాన్యం తరలించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని సరైన సమయంలో తరలించి రైతులను ఆదుకోవాలని కోరారు. కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని మహాదేవపూర్, ఎడపల్లి, కాలేశ్వరం, అన్నారం, బొమ్మపూర్, బెగు లూరు, సూరారం, అంబటిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
వరంగల్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

కాట్రపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు

- మార్క్ చూపిన జీపీ కార్యదర్శి భూక్య మహేందర్

నవతెలంగాణ-రాయపర్తి

మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1996ఓటర్లకు గాను రెండు పోలింగ్ బూత్‌లను (157, 158) ఏర్పాటు చేశారు.దీనికి గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మహేందర్‌ను రూట్ ఆఫీసర్-పోలింగ్ బూత్ ఇంఛార్జిగా నియమించారు. మహేందర్ ప్రత్యేక చొరవ చూపి పోలింగ్ కేందంలో ఓటర్లు, పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశారు. ఓటు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లు ఎండ తీవ్రతకు, ఉక్కపోతకు ఇబ్బందులు పడకుండా ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. ఓటర్ల దప్పిక తీర్చడానికి కూల్ వాటర్, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా టిఫిన్, వెజ్-నాన్ వెజ్ భోజనంతో



పాటు స్నాక్స్, కూల్ డ్రింక్స్, మజ్జిగ వంటివి సమకూర్చారు. కార్యదర్శి మహేందర్ చేసిన సౌకర్యాలకు గ్రామ ప్రజలు, ఎన్నికల సిబ్బంది, ఉన్నత అధికారులు హర్షం వ్యక్తం చేశారు. రెండు పోలింగ్ బూత్‌ల్లో సమయం ముగిసేసరికి 91శాతం పోలింగ్ అయినట్లు తెలిపారు.



బొట్ల పోషాలు దశదిన కర్మకు జి నాగయ్య హాజరు

నవతెలంగాణ-హన్మకొండ

ఈ నెల 3న వడదెబ్బతో మరణించిన సిపిఎం హను మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి తండ్రి బొట్ల పోశాలు వడ దెబ్బతో మతి చెందగా వారిని వారి కుటుంబాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, పాలడుగు భాస్కర్ భూపాలపల్లి, జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఉప్పలయ్య సోమవారం పరామర్శించారు. ముందుగా పోషాలు చిత్రపటానికి నివాళ్లర్పించారు.ఈ కార్యక్రమంలో పోషాలు కుమారులు బోట్ల. కుమారస్వామి, సిపిఎం హనమకొండ జిల్లా కార్యదర్శి బోట్ల.చక్రపాణి, బోట్ల రంజిత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-వరంగల్

పార్లమెంట్ ఎన్నికలలో ఆదివారం ప్రముఖులు ప్రజా ప్రతినిధులుయువకులు ట్రాన్స్ జెండర్స్ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలిక కళాశాలలో మేయర్ గుండు సుధారాణి, హన్మకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధి హంటర్ రోడ్డు ప్రభుత్వ పాఠశాలలో రి టర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా



కలెక్టర్ పి.ప్రావిణ్య హక్కును వినియోగించుకున్నారు. మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో మాజీ మేయర్ గుండె ప్రకాష్, ఎస్ఆర్ఆర్ తోటలో వాణి విద్యానికేతన్ పాఠ శాలలో ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతంగా ఓటు వేసే యువకులు సైతం ఉత్సాహం తో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నికల సరళి...

లోకసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల లైవ్ స్ట్రీమింగ్‌ను ఆర్ఓ, కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. ప్రతి రెండు గంటలకు పోలైన ఓట్ల వివరాల సేకరణకు నియమించిన అధికారులు, సిబ్బందికి సమర్ధవంతంగా ని ర్వహించుటకు పలు సూచనలు చేస్తూ కలెక్టర్ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ద్వారా దివ్యంగులు, వయో వద్దుల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సౌక ర్యాన్ని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలె క్టరేట్లో కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ పరిశీలించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి : ఎర్రబెల్లి

నవతెలంగాణ-పర్వతగిరి

ప్రతీ ఒక్కరూ ఓటు హ క్కును సద్వినియోగం చేసుకో వాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మం డల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఎస్ఎస్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 265పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అతని భార్య ఉషాదయాకర్‌రావుతో కలిసి సోమ వారం తమ ఓటు హక్కును వినియో గించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను అమెరి కాలో ఉన్నా... ఎక్కడ ఉన్నా నాస్వంత గ్రామంలో తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుం టానన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా తీసుకుని వినియోగించుకోవాలన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన బీజేపీ అభ్యర్థి...

వరంగల్ జిల్లా పర్వతగిరి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ సోమవారం పరిశీలించారు. అనంతరం పోలింగ్ సర ళిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కుమార్, ఏకాంతం, మధు తదితరులు పాల్గొన్నారు. కాగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆర్కే పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

ప్రశాంతంగా పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్

- సాయంత్రం 5 గంటల వరకు 73.01 శాతం పోలింగ్
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన బలరామ్ నాయక్





నవతెలంగాణ-నర్సంపేట

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఎండల తీవ్రత కాస్తా ఆదివారం కురిసిన వర్షం కారణంగా వాతవరణం చల్లబడి పోలింగ్‌కు అనుకూలించింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు మధ్యాహ్నం కూడా చేరుకోవడం కన్పించింది. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా గ్రామీణ ప్రాంత ఓటర్లు ఆయా కేంద్రాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలో 283 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి కాస్తా మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటలకు పుంజుకొని 28.5 శాతం నమోదు కాగా ఒంటి గంట వరకు 43.6 శాతం, మధ్యాహ్నం 3 గంటల వరకు 62.5 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు 73.01 శాతానికి పోలింగ్ సరళీ చేరుకొంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బలరాం నాయక్

నర్సంపేట మండలంలోని ఇటుకాలపెల్లి, ముత్తోజిపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మహబూబాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రేస్ (ఇండియా కూటమి) అభ్యర్ధి పోరిక బలరామ్ నాయక్ సందర్శించారు. పోలింగ్ సరళీని అడిగి తెల్సుకున్నారు.సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రేస్ శ్రేణులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపెల్లి రవీందర్ రావు, నాయకులు వేముల సాంబయ్య, ఓర్సు తిరుపతి, లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి : మాజీ ఎమ్మెల్యే

పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. సోమవారం పలు పోలింగ్ కేంద్రాల సమీపంలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలను పెద్ది పలకరించారు. పోలింగ్ సరళీని అడిగి తెల్సుకున్నారు. ఈఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టమౌతుందని, పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణకు రక్షణ బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని ఓటర్లు ఈ పోలింగ్ ద్వారా తెలియజేస్తున్నారన్నారు. ఆయన వెంటబీఆర్ఎస్ నాయకులు నాగిశెట్టి ప్రసాద్, రాయిడి దుశ్యంత్ రెడ్డి, పెరమండ్ల ప్రభాకర్, పాలడుగు రమేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో బాలల హక్కులకు భంగం

నవతెలంగాణ-రాయపర్తి

దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అధికారుల అత్యుత్సాహంతో బాలల హక్కులకు భంగం వాటిల్లింది. నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తును మార్చే పౌరులు అని ఊదరగొట్టే ప్రసంగాలు ఇచ్చే అధికారులే లోక్‌సభ ఎన్నికల సాక్షిగా విద్యార్థులను ఎన్నికల వాలంటీర్లుగా మార్చి రోజు మొత్తం పోలింగ్ కేంద్రాల్లో మండుటేల్లో ఉక్కపోతల్లో నిలబెట్టారు. 9వ తరగతి విద్యార్థులకు పోలింగ్ వాలంటీర్ల టీ షార్టులు వేసి టోపీలు పెట్టించి పని మనుషుల్లా వాడుకోవడంశోచనీయం. మండలంలో 52 పోలింగ్ కేంద్రాల్లో విద్యార్థులను వాలంటీర్లుగా ఉపయోగించుకోవడంతో తల్లిదండ్రులు, స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.



ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లోకి చేరిన ఈవీఎంలు

ఓటర్ నాడీ ఎటువైపో.. జూన్4న తేలనున్న భవితవ్యం

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికలు ప్రశాంతంగా ముగి సాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మందకోడిగా సాగిన, సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు పోటెత్తారు. క్యూలో నిలబడి ఓటర్లకు అనుకూలమైన అభ్యర్థి గెలుపుకు ఒక్క ఓటు కూడా ప్రాముఖ్యం అనుకోని ఓటు వేసేందుకు ఓపికతో క్యూలో నిలబడి ఓటును వినియోగించు కున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను వరంగల్ ఈస్ట్ లో ఏర్పాటు చేశారు. ఎన్నికల సరళిని ప్రతినిత్యం రిటర్నింగ్ అధికారి వరంగల్ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు నమో దైన ఓట్ల శాతాన్ని ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈసారి వరంగల్ తూర్పు లో సాయంత్రం 6 గంట ల వరకు 64. 90 పోలింగ్ శాతాన్ని నమోద యింది. సాయంత్రం ఆరు గంటల లోపు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నమోదైన ఓట్ల శాతం తెలియాల్సి ఉంది.వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు సైతం పార్ల మెంట్ ఎన్నికలను ప్రామాణికంగా తీసుకొని ఓట్లు వేయడానికి విచ్చేసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మొదటిసారిగా వేసిన యువత నూతన ఉత్తేజంతో తమ ఓటు హక్కును వినియోగిం చుకొని ఆనందం వ్యక్తం చేశారు. వయో వద్ధులకు ఎక్కు వసేపు క్యూలో నిలబ డకుండా నేరుగా ఓటు వేయడానికి వాలంటీర్లు వయవద్ధులను తీసుకొని వెళ్లి ఓట్లు వేయించారు. ఓట ర్లకు ఉచితంగా రవాణా సౌక ర్యాన్ని స్థానిక నాయ కులు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల వరకు వరంగల్ తూర్పు లో 64. 90 ఓట్లు పోల య్యాయి.వరంగల్ పార్ల మెంట్ నియోజక వర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల లో సాయంత్రం 5 గంటల వరకు ఘనపూర్ 74. 64 శాతం,పాలకుర్తి 68.41 శాతం,పరకాల 70.20 శాతం,వరంగల్ వెస్ట్ 47.00 శాతం,వరంగల్ ఈస్ట్ 59.43శాతం,వర్ధన్నపేట 66.43 శాతం, భూపాల పల్లి 65.00 శాతం, మొత్తం 64.08 శాతం పోలింగ్ శాతం నమోదయింది. ఈవీఎంలను ఏనుమాముల మార్కెట్ లోని ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ లో పోలీస్ బందోబస్తుతో భద్రపరిచారు. ఎన్నికల తరలింది చూస్తే ఎన్నికలలో గెలుపు ఎవరిదో ఓటరు నాడి ఎటువైపు పడిందో రాజకీయ విశ్లేషకులు తలలు పట్టుకుంటున్నారు. ఏది ఏమైనా అప్పటికి జూన్ 4న 12 ఎన్నికల ఫలితాలు వెలువలనున్నాయి.